న్యూసెన్స్ చేస్తే కేసే..

కొత్త సంవత్సర వేడుకలపై నిఘా
- నిర్వాహకులు నిబంధనలు పాటించాల్సిందే..
- ఇతరులను ఇబ్బంది పెడితే కఠినంగా వ్యవహరిస్తాం..
- డ్రగ్స్, గంజాయి సరఫరాపై ప్రత్యేక నిఘా
- బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి





సనత్‌నగర్: మరికొద్ది రోజుల్లో కొత్త సంవత్సరం వస్తోంది. ఇందుకోసం ప్రత్యేక ఈవెంట్లను కూడా నిర్వహిస్తారు. అయితే.. న్యూ ఇయర్ జోష్‌లో ఏమాత్రం అతిచేసినా చర్యలు తప్పవంటున్నారు బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి. అటు ఈవెంట్ల నిర్వాహకులు నిబంధనల మేరకు నడుచుకోకపోయినా, ఇటు వేడుకలకు హాజరయ్యేవారు న్యూసెన్స్ చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. కొత్త సంవత్సర వేడుకల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న చర్యలుపై ఏసీపీ గోపాలకృష్ణమూర్తితో 'సాక్షి' తో మాట్లాడారు.

◆ **అనుమతి తప్పనిసరి**

న్యూఇయర్ ప్రత్యేక ఈవెంట్ల కోసం అనుమతి తప్పనిసరి. ఎంట్రీ, ఎగ్జిట్‌లతో పాటు ఈవెంట్ జరిగే ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలి. ప్రత్యేక సెక్యూరిటీని నియమించుకోవాలి. విద్యుత్ వైరింగ్, ఫైర్ సేఫ్టీ వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. అరకొర డ్రెస్సులతో యువతులతో నృత్యాలు చేయించేవారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. ఈవెంట్ల వద్ద క్రాకర్స్ వంటి పేలుడు పదార్థాలను ఉంచడం గానీ, కాల్చడం చేయవద్దు. ఎంతమందికి అనుమతి తీసుకున్నారో అంత మేరకే ఈవెంట్‌కు అనుమతించాలి. పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించాలి. డీజేలకు ఎలాంటి అనుమతి లేదు. 45 డెసిబల్స్‌కు మించకుండా లౌడ్‌స్పీకర్లను ఉపయోగించాలి. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల వరకే లౌడ్ స్పీకర్ల అనుమతి.

◆ **డ్రగ్స్ అనే పదం వినిపించకూడదు..**

ఎక్కడెక్కడ ఈవెంట్లు జరుగుతున్నాయో ఈవెంట్ల నిర్వాహకులకు ముందుగానే సూచనలు జారీ చేస్తున్నాం. డ్రగ్స్ అనే పదం వినిపించకూడదని హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నాం. ఎవరైనా డ్రగ్స్, గంజాయి సరఫరాకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం. అలాగే పోలీసుల నిరంతర నిఘా కూడా కొనసాగుతుంది. ఇందుకోసం క్రైం టీమ్‌తో పాటు స్పెషల్ టీమ్‌లను నియమిస్తున్నాం. ఈవెంట్లకు అర్ధరాత్రి ఒంటి గంట వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఇక బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపుల సమయ వేళలు ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన ప్రకారం కొనసాగుతాయి. అంతకమించి తెరిచి ఉంటే చర్యలు తీసుకుంటాం.

◆ **బహిరంగంగా మద్యం తాగితే చర్యలు**

కొత్త సంవత్సర వేడుకలు మంచి అనుభూతిని ఇచ్చేలా జరుపుకోవాలి గానీ చేదు అనుభవం కాకూడదు. రోడ్లపై బహిరంగంగా మద్యం సేవించడం, న్యూసెన్స్‌కు పాల్పడడం వంటివి చేస్తే నిబంధనల ఉల్లంఘన చట్టం కింద చర్యలు తప్పవు.

◆ **చెక్‌పోస్టుల ఏర్పాటు**

ప్రధాన రహదారులతో పాటు ఈవెంట్లు జరిగే ప్రాంత రహదారులపై ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో చెక్‌పోస్టులను ఏర్పాటుచేస్తాం. ఈవ్‌టీజర్ల ఆటకట్టించేందుకు షీటీమ్‌లను రంగంలోకి దించుతాం. కంటోన్మెంట్ వంటి ఐసోలేటెడ్ ఏరియాల్లో పాట్రోలింగ్ మొబైల్ టీమ్‌తో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తున్నాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న పోలీసులతో పాటు అదనంగా ఆర్మ్‌డ్ ఫోర్స్‌ను కూడా తీసుకుంటున్నాం. డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ టీమ్‌లను అందుబాటులో ఉంచుతున్నాం.

వైభవంగా రైల్వే మజ్దూర్ యూనియన్ వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు



హాజరైన ఉద్యోగులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్‌లో శుక్రవారం రైల్వే మజ్దూర్ యూనియన్ 74వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. రైల్ కళారంగ్ ఉద్యోగులతో కళకళలాడింది. సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ వర్కింగ్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. జోనల్ అధ్యక్షులుగా మరోమారు కాల్వ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళీధర్, కోశాధికారిగా సరోజినీరెడ్డి, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీలుగా ఉదయ భాస్కర్, భారతి, రామక్రిష్ణ, శ్రీనివాస్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం :శంకర్‌రావు

రైల్వే ఉద్యోగులు, కార్మికుల హక్కుల పరిరక్షణ, మనుగడ కోసం మజ్దూర్ యూనియర్ అలుపెరగని పోరాటం చేస్తోందని ప్రధాన కార్యదర్శి శంకర్ రావు అన్నారు. ఉద్యోగులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ముందుకు సాగాలన్నారు.

సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడిగా షేక్‌ఖాజ, సెక్రెటరీగా రవీందర్

మజ్దూర్ యూనియన్ వార్షికోత్సవ సమావేశంలో నూతన కమిటీలను ఎంపిక చేశారు. డివిజనల్ అధ్యక్షులుగా షేక్ ఖాజబాబ, కార్యదర్శిగా రవీందర్, అసిస్టెంట్ డివిజనల్ సెక్రెటరీలుగా చిలుకు స్వామి, పీఎస్ శ్రీనివాస్‌రావు, నాగలక్ష్మీ, రమేష్‌కుమార్, జోనల్ సభ్యులుగా బచ్చలి శ్రీనివాస్, నవనీత్ సింగ్ ఎన్నికయ్యారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పలువురి శుభాకాంక్షలు



వేడుకల్లో పాల్గొన్న ప్రొ ఇటికాల పురుషోత్తమ్

లాలాపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టీటీడీ మాజీ మెంబర్ దర్గా సుఖేందర్‌రెడ్డి తన జన్మదిన వేడుకలను లాలాపేటలోని తన నివాసంలో వివిధ పార్టీ నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తమ్, కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టీజేఏసీ కోశాధికారి వంగ ఉపేందర్,వినయ్, శామ్యూల్ తదితరులున్నారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సు



సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో శుక్రవారం అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. శుక్రవారం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలోని ఈ–క్లాస్ రూంలో ప్రస్తుత ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో సవాళ్లు–ఆవిష్కరణలు అనే అంశం పై రెండు జరిగే అంతర్జాతీయ సదస్సుకు కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సావనీరు ఆవిష్కరించారు. కృష్ణ ఇంజినీరింగ్ కన్సల్టెనీ అమెరికా అధ్యక్షులు గోపాల్ టీకే కృష్ణ, ఐఐటీ కాన్పూర్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ప్రొ.సురేష్ చంద్ర శ్రీవత్సవ్, సదస్సు కన్వీనర్లు ప్రొ.ఏసు రత్నం, కో–కన్వీనర్లు ప్రొ.మంజుల, ప్రొ.మంగు, హెడ్ ప్రొ.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తీరు సరికాదు'



ఓయూలో మాట్లాడుతున్న విజయ్‌నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుసరించిన తీరు సరికాదని ఓయూ జేఏసీ నేతలు శుక్రవారం పేర్కొన్నారు. అసెంబ్లీలో చర్చ జరుగుతున్న తరుణంలో కాగితాలను స్పీకర్ పైకి విసిరివేయడం సిగ్గుచేటు అన్నారు. కౌశిక్‌రెడ్డి తక్షణం స్పీకర్ ప్రసాద్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత స్పీకర్ పై కాగితాలను చింపి విసిరిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నేతలు నోముల శేషు, సైదులుయాదవ్, టీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌నాయక్ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి గుడ్లు, టమాటాలతో స్వాగతం పలుకుతాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో శనివారం జరిగే కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన కృతజ్ఞత సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యే టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు గుడ్లు, టమాటలతో స్వాగతం పలుకుతామని బీఆర్ఎస్వీ నాయకులు కోనాపురం శశిపాల్ శుక్రవారం పేర్కొన్నారు. ఎన్నికల హామీలో ఏటా 2 లక్షల ఉద్యోగాల భర్తీతో పాటు నిరుద్యోగ భృతి, రూ.5 లక్షల విద్యా భరోసా, వర్సిటీల అధ్యాపకుల ఉద్యోగాల భర్తీ, నాన్‌నెట్ ఫెలోషిప్‌లు, విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలలో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఓయూ అడుగుపెట్టాలని లేని పక్షంలో అడ్డుకుంటామని హెచ్చరించారు.

'ప్రభుత్వం పట్టించుకోనందుకే అసెంబ్లీ ముట్టడి'



అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన రాజుసింగ్ తదితరులు

రసూల్‌పురా: ఆటో డ్రైవర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారానికి శుక్రవారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బీఆర్‌టీయూ ఆటో యూనియన్ కంటోన్మెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజు సింగ్ ఆధ్వర్యంలో పలువురు ఆటో డ్రైవర్లు కంటోన్మెంట్ బాలంరాయి కమాన్ నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజుసింగ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆటో డ్రైవర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోకపోవడంతో అసెంబ్లీ ముట్టడి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నవీన్, లక్ష్మణ్, అలీం, అజాం, ప్రశాంత్, రాములు పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పోలీసు వాహనం అద్దాలు ధ్వంసం కేసు.. నిందితుల అరెస్టు

రాంగోపాల్‌పేట్: మద్యం మత్తులో భార్యాభర్తలు పోలీస్ స్టేషన్‌లో హంగామా చేయడమే కాకుండా పోలీసు వాహనం అద్దాలు ధ్వంసం చేసిన కేసులో భార్య భర్తలను గోపాలపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీ నగర్‌కు చెందిన సైదయ్య గురువారం మధ్యాహ్నం రైల్వే స్టేషన్ ఎదురుగా సందర్శిని హోటల్ వద్ద బస్సు కోసం వేచి ఉన్నారు. అదే సమయంలో జేబీఎస్ బస్టాండ్ వద్ద నివాసం ఉండే శ్రీలక్ష్మి (34), అమె భర్త ములగాల వెంకట రమేష్ (42)లు మద్యం తాగి అక్కడికి వచ్చి సైదయ్య చేతిలో బ్యాగును లాక్కున్నారు. అంతటితో ఆగకుండా ఆయన దగ్గర ఉండే వెయ్యి రూపాయాల నగదును లాక్కునేందుకు యత్నించగా ప్రతిఘటించారు. దీంతో శ్రీలక్ష్మి ఆయన చేతిని కొరికింది. దీంతో ఆయన స్థానికుల సహకారంతో గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. మద్యం మత్తులో ఉన్న వారిని గాంధీ ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు యత్నించగా బయట ఉన్న కారు అద్దాన్ని శ్రీలక్ష్మి రాయితో పగులగొట్టిన విషయం తెలిసిందే. అంతటితో ఆగకుండా వాహనంలో ఆస్పత్రికి తీసుకుని వెళుతుండగా కానిస్టేబుల్ చేతిని కొరికింది. దీంతో నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 21, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 55, క్యాబేజీ 18, క్యారెట్ 25, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 23, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 23, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూలో ముగిసిన వర్క్‌షాప్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ఫిజిక్స్ విభాగంలో గత పదిరోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. 40 సెషన్స్‌లో 45 మంది పీహెచ్‌డీ విద్యార్థులు శిక్షణ పొందినట్లు హెడ్ ప్రొ.శ్రీనివాస్ తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డి హాజరుకాగా ప్రొ.సుబోధ్ ఆర్ శేనోయ్, డా.ప్రమోద్ హె. బోర్స్, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, ప్రిన్సిపల్ ప్రొ.ప్రభాకర్, ప్రొ.ప్రసాద్, ప్రొ.లక్ష్మన్‌నాయక్ తదితరులు పాల్గొని ప్రసగించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందచేశారు.

తెలంగాణ స్టడీస్ డైరెక్టర్‌కు పలువురి అభినందన



ప్రొ.రాము షఫర్డ్‌కు అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని తెలంగాణ స్టడీస్‌కు డైరెక్టర్‌గా నియమితులైన ప్రొ.రాముషఫర్డ్‌కు విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం పుష్పగుచ్ఛాన్ని అందచేసి అభినందనలు తెలిపారు. మహాత్మ పూలే మొదలు డా.బీఆర్ అంబేడ్కర్, మార్క్స్ తదితర అనేక మంది ప్రపంచ మేథావులు, ఇతర అంశాల పై వేలాది పుస్తకాలను అభ్యసించిన ప్రొ.రామును తెలంగాణ స్టడీస్ డైరెక్టర్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.పరంధాములు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, విజయ్, అశోక్, నాగేందర్, మణి, దినేష్, సిరాజ్, అజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘు బాబు తెలిపిన మేరకు... లాలాపేటలోని సత్యనగర్ కమ్యూనిటీహాలు సమీప ప్రాంతానికి చెందిన అంకుష్ కంజ్(34) క్యాటరింగ్ పని చేస్తుంటాడు. ఇతనికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చిన అంకుష్ కంజ్ భార్యతో గొడవపడి బెడ్రూమ్‌లోకి వెళ్లి పడుకున్నాడు. మరుసటిరోజు ఉదయం గదిలోంచి బయటకు రాకపోవడంతో తలుపులు బద్దలుగొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్య,ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి



జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

లాలాపేట: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మెన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను శుక్రవారం బీఆర్‌కె భవన్‌లో మాదిగ మహిళా సమాఖ్య నాయకురాళ్ల బృందం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. మాదిగ సామాజిక వర్గంలో సగ భాగంగా ఉన్న మహిళలకు జనాభాదామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో సమాన వాటా దక్కేలా చూడాలని దళిత మహిళలు ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో బతకడానికి అవకాశం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో మాదిగ మహిళా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు పాలడుగు మేరీ మాదిగ, రాణి, ధనలక్ష్మీ, సుజాత, రీసెర్చ్ స్కాలర్స్ ప్రణతి, కవిత తదితరులున్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే కేటీఆర్‌పై అక్రమ కేసులు



పొన్నబోయిన సురేష్‌యాదవ్



కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

సనత్‌నగర్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అక్రమంగా కేసులు పెడుతోందని బీఆర్ఎస్ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు, యాదవ సంఘం అధ్యక్షుడు పొన్నబోయిన సురేష్‌యాదవ్ ఆరోపించారు. బేగంపేటలోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వమని, తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెట్టి తమ నైజాన్ని నిరూపించుకుంటుందన్నారు. దేశ విదేశాల్లో పర్యటించిన నగరానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులను కేటీఆర్ నగరానికి తీసుకుని హైదరాబాద్ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులను పెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

అడ్డగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత ధోరణి అవలంబిస్తోందని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని ప్రపంచ పటంలో పెట్టేందుకు తీసుకున్న నిర్ణయాలను తప్పుపడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఏసీబీ అధికారులు కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

రాంగోపాల్‌పేట్: ఎలోహిమ్ హీలింగ్ మినీస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాట్రిక్ టీమ్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అనంతరం ఎలోహీమ్ హీలింగ్ మినిస్ట్రీస్ ప్రతినిధులు కేక్‌ను కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్‌లోని క్రిస్టియన్ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగ ప్రత్యేకతను పాస్టర్లు కళ్లకు కట్టినట్లుగా వివరించారు.





రేపు నగరం చేరుకోనున్న 'గో మహా పాదయాత్ర'

పంజగుట్ట: గో, భూ, పర్యావరణ పరిరక్షణ కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న గో మహా పాదయాత్ర హైదరాబాద్ చేరుకుంటున్న నేపథ్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత గో సేవా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మల్లేష్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమాల కరపత్రాన్ని ప్రతినిధులు శ్రీనాథ్, రాఘవేందర్, మానిక్ యాదవ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవును కాపాడేందుకు అఖిల భారత గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలక్రిష్ణ గురుస్వామి ఒక పుంగనూరు గోవుతో గత సెప్టెంబర్ 27 నుంచి 2025 మార్చి 27 వరకు 14 రాష్ట్రాలు, 4900 కిలోమీటర్ల మేర 180 రోజుల కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. యాత్ర 87 రోజులుగా 9 రాష్ట్రాలు దాటి 2700 కిలోమీటర్లు పైగా పూర్తి చేసుకుని ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌కు చేరుకుంటున్న నేపథ్యంలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ శివశంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్, శివ స్వామీజీ, మాతా నిర్మలానంద యోగ భారతిలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ శర్మ, శివపార్వతి మాత, కృష్ణవేణి మాత, అన్నపూర్ణ, జైపాల్ సింగ్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో పయనించాలి



గాస్పెల్ చర్చ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: ఏసుక్రీస్తు సేవ కరుణ, త్యాగానికి ప్రతీక అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. రసూల్‌పురాలో శుక్రవారం జరిగిన స్కోత్ గ్యాస్పెల్ చర్చ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు కరుణామయుడని ఆయన మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలని కోరారు. కార్యక్రమంలో శాంసన్ రాజు, బిషప్ నేహమ్యా శ్రీనివాస్ రావు. శ్రీను, నాగరాజు, జైపాల్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిల పాస్టర్లతో ఎమ్మెల్యే సమావేశం



పాస్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. తుకారాంగేట్‌లో చర్చిల పాస్టర్లతో ఎమ్మెల్యే శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులకు ప్రభు త్వం తరుపున ప్రతీ చర్చికి లక్ష రూపాయలను అందిస్తుందన్నారు. అన్ని మతాల వారికి న్యాయం చేస్తూ, వారి సంక్షేమాభివృద్ధికి ఎన్నో పథకాలను తీసుకువస్తుందని వివరించారు.

అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన కోట నీలిమ



మోండా మార్కెట్‌లో అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కోట నీలిమ

పద్మారావునగర్: మోండా మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదం ప్రాంతాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కోట నీలిమ సందర్శించారు. అగ్నిప్రమాదంలో పలు దుకాణాలు దగ్ధమయ్యాయి. బాధితులను డాక్టర్ కోట నీలిమ పరామర్శించారు. అగ్నిప్రమాదం జరిగిన తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ.. ప్రభుత్వం తరపున బాధితులకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక వ్యాపారులతో పాటు కాంగ్రెస్ నాయకులు గంటా సుధీర్, బద్రీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సహకారం అందించాలి



లిఫ్టును ప్రారంభిస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ బాలకృష్ణ

కంటోన్మెంట్: దివ్యాంగులకు సేవలందించే సంస్థలకు సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. కార్ఖానా వాసవీనగర్‌లో దివ్యాంగుల సేవా సంస్థ పమెన్ క్యాప్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్టును ప్రముఖ మెజీషియన్, సెన్సార్ బోర్డు సభ్యుడు సామల వేణుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పమెన్ క్యాప్ సంస్థ వందలాది మంది దివ్యాంగులకు ఉచిత వసతి, సేవలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వక్కంతం చంద్రమౌళి, పమెన్ క్యాప్ సంస్థ ప్రెసిడెంట్ పి.గోపీనాథ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.